క్లుప్తంగా

లైబ్రరీకి పుస్తకాల అందజేత

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు స్థానిక లైబ్రరీకి పుస్తకాలు అందజేశారు. వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు అవసరమయ్యే పుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశ్యంతో 1999 సంవత్సర పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు సుబ్బారెడ్డి, తిరుపతిరెడ్డి, ఫణి, రజాక్, శ్యామ్ బాబు తమ వంతు సాయంగా పుస్తకాలను లైబ్రేరియన్ రాఘవరెడ్డికి అందజేశారు.

సన్మానం



అబ్దాల్‌హుస్సేన్‌సాహెబ్‌ఖాద్రీని సన్మానిస్తున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె : పట్టణంలోని జెండేవాలేసాహెబ్ సయ్యద్ అబ్దాల్ హుస్సేన్‌సాహెబ్‌ఖాద్రీని గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని ఓబులరెడ్డి ఘనంగా సన్మానించారు. సయ్యద్‌అబ్దాల్‌సాహెబ్ ఖాద్రీ 120 మంది భక్తులతో కలిసి 25 రోజుల పాటు మక్కా, బాగ్దాద్ తదితర ఇస్లామిక్ అధ్యాత్మిక యాత్ర ఉమ్రాకు వెళ్తున్న సందర్భంగా ఆయనను ఓబులరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో కలాం, ముక్తియార్, షాషా, మహమ్మద్ హుస్సేన్, అనూ, సుదర్శన్ రెడ్డి, కొనేటి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



చైతన్యకు మెమొంటో అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న వివేకానంద సేవా సమితి సభ్యులు

డోన్ టౌన్ : పట్టణంలో వివేకానంద విగ్రహం ఏర్పాటుకు తనవంతు రూ.లక్ష విరాళం అందజేసిన వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధక్షుడు పోస్టు ప్రసాద్ సతీమణి చైతన్యను సేవా సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. గురువారం వివేకానంద సేవా సమితి గౌరవ అధక్షులు సప్త శైల తిమ్మయ్య, కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు, సభ్యులు ఎలుకూరి సురేష్ తదితరులు పోస్టు ప్రసాద్ ఇంటికి వెళ్లి చైతన్యను సత్కరించి మెమొంటో అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. యువతకు ఆదర్శంగా నిలిచి భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ నలుమూలల చాటి చెప్పిన వివేకానందుడి విగ్రహం ఏర్పాటుకు సహకరించిన ప్రతిఒక్కరికీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీరాములు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని యాగంటిపల్లె రహదారిలో ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ సమీపంలో బనగానపల్లెకు చెందిన దివంగత రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పాతపాడు నాగప్ప, కుటుంబ సభ్యులు నాగమ్మ, రాధిక జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుడు బనగానపల్లె నాయీ బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీరాములు చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోదరుడు, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో చలివేంద్రం నిర్వాహకులు పాతపాడు క్రిష్టయ్య, పాతపాడు మంజునాథ్, మధు, ఉపాధ్యాయులు మధుసూదన్‌రావు, గౌండా మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వన్నూర్ వలీస్వామి గంధం వేడుకలు

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామస్తుల ఆరాధ్య దైవంగా పేరొందిన హజరత్ వన్నూర్ వలీ స్వామి గంధం వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. దర్గా నిర్వాహకులు ముల్లా వన్నూర్ బాషా ఇంటి నుంచి హజరత్ వన్నూర్ వలీ స్వామి ఉత్సవం విగ్రహిన్ని గంధం మహోత్సవంతో దర్గా చేరుకున్నారు. గంధం సమర్పించి ప్రార్థనలు చేశారు.

పరామర్శ



వలంటీర్ రమేష్‌తో మాట్లాడుతున్న కాటసాని ఓబులరెడ్డి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తుమ్మలపెంటకు చెందిన వలంటీర్ రమేష్‌ను గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి పరామర్శించారు. మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన రమేష్ తాడిపత్రి ఆసుపత్రిలో చికిత్సల అనంతరం ఇంటికి చేరుకున్నాడు. ఈ మేరకు కాటసాని ఓబులరెడ్డి వలంటీర్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోట శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ వర్కింగ్ కమిటీ మండల అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, నాయకులు బాలస్వామిరెడ్డి, వెంకట లక్ష్మిరెడ్డి, యాపర్ల వెంకటేశ్వరరెడ్డి, పాపిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కోనేటి దుర్గ పాల్గొన్నారు.

పారదర్శక పాలనతో ఆదర్శంగా నిలిచాం

- దళారీ వ్యవస్థను రూపుమాపం
- మోడల్ నియోజకర్గంగా డోన్‌ను తీర్చిదిద్దాం
- ప్యాపిలిలో 411 ఎకరాల భూపంపిణీ చేసిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



సంపూర్ణ భూహక్కు పత్రం అందజేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



సభకు హాజరైన మహిళా రైతులు

ప్యాపిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారదర్శక పాలనతో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా సాగిన దళారి వ్యస్థను రూపుమాపామని, అర్హులందరికీ నేరుగా సంక్షేమ ఫలాలు వర్తింపజేశామన్నారు. మండల కేంద్రం ప్యాపిలి షాదీఖానాలో గురువారం 291 మంది రైతులకు సంపూర్ణ భూహక్కు పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. గత టీడీపీ హయాంలో భూకబ్జాలు, ఆక్రమణలు, దౌర్జన్యాలు ఉండేవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వం వాటన్నింటికీ చెక్ పెట్టిందన్నారు. గత పాలకులు ఆన్‌లైన్ సమస్యలతో రైతులకు చుక్కలు చూపించారని, నేడు ఉన్నగ్రామంలోనే సచివాలయంలో ప్రతి విషయం అందుబాటులోకి వచ్చిందని గుర్తు చేశారు. గతంలో తహసీల్దార్ కార్యాలయంలో చిన్న పని చేసుకోవాలన్నా దళారులపై ఆధారపడాల్సి వచ్చేదన్నారు. దళారి వ్యవస్థను తాము రూపుమాపామన్నారు. చేతులు తడపనితే పనులు జరగని ఆ రోజులను ప్రజలు ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోవాలని విన్నవించారు. ప్రస్తుతం ఎంత పెద్ద పని అయినా ప్రజలు నేరుగా సచివాలయాలకు వెళ్లి పరిష్కరించుకుంటున్న జగనన్న పాలన తీరును గమనించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా సాగులో ఉన్న రైతులకు సంపూర్ణ భూహక్కు పథకం ద్వారా భూ పంపిణీ చేసేందుకు కూడా గత పాలకులకు మనసు రాలేదన్నారు. డోన్ నియోజవకర్గాన్ని మోడల్ నియోజవకర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన మాట నిలుపుకున్నారని మంత్రి తెలిపారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. కార్యక్రమంలో స్టేట్ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు బోరెడ్డి రాము, బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, జంగం చంద్రశేఖర్, చంద్రశేఖర్ రెడ్డి, కొండయ్య, మస్తాన్ ఖాన్, బషీర్, షాషా, పాండు తదితరులు పాల్గొన్నారు.

టికెట్ వస్తుందో..రాదో తెలియని అయోమయంలో విమర్శలేలా ?

డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న ధర్మవరం సుబ్బారెడ్డికి డోన్ టీడీపీ టికెట్ వస్తుందో..రాదో తెలియని అయోమయంలో కొట్టుమిట్లాడుతూ కూడా తనపై విమర్శలేలా అని మంత్రి బుగ్గన ఎద్దేవా చేశారు. సినిమాలో సీన్‌లు మారినట్లు డోన్ నియోజకవర్గం నుంచి టీడీపీ టికెట్ విషయంలో రోజుకో పేరు తెరపైకి వస్తోందన్నారు. టికెట్ విషయంలో నమ్మకం లేని వారు కూడా డోన్‌లో అభివృద్ధి జరగలేదని చవకబారు విమర్శలు చేస్తున్నారని మంత్రి ధ్వజమెత్తారు. డోన్ నియోజవవర్గంలోని ఏ గ్రామానికి వెళ్లినా తాను చేసిన అభివృద్ధి కనిపిస్తుందని, ఈ విషయాన్ని టీడీపీ శ్రేణులు తప్పా ప్రతిఒక్కరూ అంగీకరిస్తున్నారని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు.

చంద్రబాబు బకాయి ఉన్న 60 సిలిండర్లు అడగండి...

2014 ఎన్నికల ముందు ఏడాదికి 12 సిలిండర్లు ఉచితంగా ఇస్తానని అబద్ధపు హామీతో మభ్యపెట్టి అధికారం చేజిక్కించుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కనీసం ఒక్క సిలిండరైనా ఇచ్చాడా? అని మంత్రి మహిళలను ప్రశ్నించారు. మాయమాటలతో మభ్యపెట్టే బాబు మళ్లీ ఎన్నికలు సమీపించడంతో ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తానని హామీ గుప్పిస్తున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏడాదికి 12 సిలిండర్ల చొప్పున ఐదేళ్లకు 60 సిలిండర్లు చొప్పున మహిళలకు బకాయి ఉన్నాడని, ముందుగా ఆ సిలిండర్లు ఇవ్వాలని గట్టిగా నిలదీయాలని ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మహిళలకు పిలుపునిచ్చారు.

నీటి సరఫరాలో రెండు రోజులపాటు అంతరాయం

డోన్ టౌన్ : పట్టణానికి తాగు నీరు సరఫరా చేసే ప్రధాన నీటివనరైన గాజులదిన్నె ప్రాజెక్టు పైపులైన్‌కు రంధ్రం పడినందున రెండు రోజులపాటు శుక్ర, శనివారాలు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని కమిషనర్ డాక్టర్ జయరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణగిరి మండలం సంగాల గ్రామం వద్ద పైపులైనుకు లీకేజ్ కారణంగా మరమత్తులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. పట్టణ ప్రజలు ఉన్న నీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలని, మరమ్మతులు పూర్తవ్వగానే యథావిధిగా నీటి సరఫరా చేస్తామన్నారు.

నివాళి



చెన్నారెడ్డి లక్ష్మి రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తండ్రి చెన్నారెడ్డి పెద్ద దిన కర్మ కార్యక్రమం గురువారం జరిగింది. చెన్నారెడ్డి లక్ష్మి రెడ్డి చిత్ర పటానికి మంత్రి బుగ్గన పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మద్దిలేటి స్వామి చైర్మన్ లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి డోన్ పర్యటన

- జాతిపిత, అమరజీవి విగ్రహాలు ప్రతిష్టించనున్న బుగ్గన



జాతిపిత విగ్రహ విష్కరణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

డోన్ : పట్టణంలోని పాతబస్టాండ్ ప్రాంగణంలో జాతిపిత మహాత్మగాంధీ విగ్రహంతో పాటు కొత్త బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి శనివారం ఆవిష్కరిస్తారని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. ఈ మేరకు మంత్రి పర్యటన ఏర్పాట్లను డీఈ రసూల్, ఏఈ సతీష్‌తో కలిసి వారు పరిశీలించారు. మొదట జాతిపిత గాంధీ విగ్రహాన్ని పాతబస్టాండ్‌లో ఆవిష్కరించి అనంతరం పాదయాత్రగా కొత్తబస్టాండ్ చేరుకొని అమరజీవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని వారు పేర్కొన్నారు. అనంతరం సాయి ఫంక్షన్ హాల్‌లో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మంత్రి బుగ్గనతో పాటు రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్ పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

వలంటీర్లకు సత్కారం



వలంటీర్లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని రెండవ సచివాలయంలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సేవారత్న, సేవామిత్రకు ఎంపికైన వలంటీర్లను మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఈఓ గోపినాథ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికి 32 రకాల సంక్షేమ పథకాలు గడపవద్దకే చేరుతున్నాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి బింధురెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ రోషిరెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరానికి స్పందన



మందులు అందజేస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నంద్యాల శాంతిరాం ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ట్రస్ట్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి ప్రారంభించారు. శాంతిరాం వైద్యులు జిలానీ, పవన్, అశోక్,నాగేంద్ర, నిర్మల ప్రజలకు బీపీ, షుగర్, ఈసీజీ తదితర వైద్యపరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీహరి,జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి,పంచాయితీ కార్యదర్శి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేవనూరు ఎస్ఐ రాంమోహన్‌రెడ్డి సూచించారు. గురువారం రాత్రి మండలంలోని పెద్ద కొప్పెర్ల గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్ వచ్చినప్పుడు ఎటువంటి పరిస్థితుల్లో బ్యాంకు ఖాతా, ఓటీపీ తదితర వివరాలు చెప్పొద్దన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. శాంతిభద్రలకు భంగం కలిగేలా ప్రవర్తిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

సంజామల: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. సైబర్ నేరగాళ్లు పొంచి ఉన్నారని, జాగ్రత్తలు పాటించాలని గురువారం ప్రకటనలో సూచించారు. సామాజిక మాధ్యమాలో గుర్తుతెలియని వ్యక్తులతో జాగ్రత వహించాలని సూచించారు. క్యూఆర్ కోడ్, ఓటీజీ, గిఫ్ట్, లోన్ యాప్స్, బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్స్ తదితర మోసపూరితమైన యాప్స్‌పై జాగ్రతగా ఉండాలన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేయాలని, తమ పరిధిలోని పోలీస్ స్టేషన్ ఆశ్రయించాలని ఎస్ఐ సూచించారు.

నేడు కోవెలకుంట్లలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని ఐదవ గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం రెండవ విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓ గోపినాథ్ తెలిపారు. వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు వివిధ జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించడంతపాటు ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. సచివాలయ పరిధిలోని కాలనీల ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హెచ్‌ఐవీపై అవగాహన

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలంలోని భీమునిపాడు, సంజామల మండలంలోని ముదిగేడు గ్రామాల్లో గురువారం హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు నంద్యాలకు చెందిన కళాజాత బృందాలతో వీధి నాటకాలను ప్రదర్శించారు. హెచ్‌ఐవీ ఎలా సంక్రమిస్తుంది, రాకుండా తీసుకొవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై కళాజాత బృందం వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రదీప్ అరుణమ్మ, చైల్డ్ ఫండ్‌ఇండియా లింక్‌వర్కర్లు వెంకటసుబ్బయ్య, నారాయణ, కళాజాత బృందం పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులకు చక్రాల కుర్చీలు పంపిణీ

ప్యాపిలి: ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడుతున్నవారికి గురువారం స్థానిక పీహెచ్‌సీలో చక్రాల కుర్చీలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, జిల్లా ఫ్లోరోసిస్ అధికారి సుధాకర్, ఎంపీడీఓ సాయిమనోహర్, వైద్యాధికారులు వాణిశ్రీ, నితీక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 47 మందికి చక్రాల కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్లోరోసిస్ అధికారి మాట్లాడుతూ త్రాగేనీటిలో ఫ్లోరైడ్ శాతం 1.5 ఎంజీ ఎక్కువగా ఉంటే ఫ్లోరోసిస్‌కు గురవుతారని తెలిపారు. ఆర్ఓ ఫిల్టర్ నీటిని తాగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

నూతన కమిషనర్ సుడిగాలి పర్యటన

డోన్ : మున్సిపల్ నూతన కమిషనర్ డాక్టర్ జయరాం గురువారం పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. 16వ వార్డు సచివాలయం పరిధిలోని పోచా ప్రభాకర్‌రెడ్డి నగర్, 29వ వార్డులోని ఇందిరానగర్, జాడీల ఫ్యాక్టరీ తదితర ప్రాంతాలలో మంచినీరు, పారిశుద్ధ్యం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులను ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనం నెలకొల్పేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన ఈ సందర్భంగా స్థానికులను కోరారు. కమిషనర్ వెంట కౌన్సిలర్లు మేకల విమల, ఆర్డ్ రమణ, మాజీ కౌన్సిలర్ మేకల నాగరాజు, సచివాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తెల్లదొరల పాలిట సింహస్వప్నం నరసింహారెడ్డి



నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కోవెలకుంట్ల: దేశానికి స్వాతంత్య్రం సిద్ధింప చేసేందుకు బ్రిటీష్‌వారిని గడగడలాడించిన విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వారిపాలిట సింహ స్వప్నమయ్యారని వక్తలు కొనియాడారు. విప్లవ వీరుడు, రేనాటి సూర్యుడు నరసింహారెడ్డి 177వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని శివాలయం పక్కన ఉన్న ఆయన విగ్రహానికి ప్రకృతిపీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి, రాయలసీమ జాయింట్‌యాక్షన్ కమిటీ కోఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్‌వారి కబంద హస్తాల నుంచి మనదేశానికి విముక్తిని కల్పించేందుకు నరసింహారెడ్డి అహింసా మార్గాన్ని ఎంచుకుని పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, పౌరహక్కుల సంఘం నాయకుడు కరీంబాషా, కార్డ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అప్పపోగు వెంకటసుబ్బయ్య, సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళి

డోన్ : ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177వ వర్ధంతిని రెడ్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రెడ్ల సంఘం భవనంలో నాయకులు హనుమంతరెడ్డి, ధారా హరినాథ్‌రెడ్డి,



నరసింహారెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నందిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ధారా ప్రతాప్‌రెడ్డి, చంద్రశే ఖర్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, క్రిష్టారెడ్డి తదితరులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

డోన్ టౌన్ : స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి సూర్యడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బలిదానం జరిగిన రోజును పురష్కరించుకొని గురువారం పట్టణంలోని పాతపేట హైస్కూల్లో హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అధ్యక్షతన ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరసింహారెడ్డి పోరాటాలను ఈ సందర్భంగా హెచ్‌ఎం గుర్తు చేశారు. ఝాన్సీలక్ష్మీబాయి తదితర వీరులు నిర్వహించిన 1857 సంవత్సర పోరాటానికి పదేళ్లముందే ఆంగ్లేయులను తరిమి కొట్టడానికి కత్తిపట్టిన వీరుడు రేనాటి సూరీడని పేర్కొన్నారు.

నాటుసారా ధ్వంసం



నాటుసారా ధ్వంసం చేస్తున్న సెబ్ సీఐ వై జోగేంద్ర, సిబ్బంది

బనగానపల్లె రూరల్ : సెబ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు బనగానపల్లె సెబ్ స్టేషన్ పరిధిలో 48 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 835 లీటర్ల సారాతోపాటు రెండు ఎన్‌డీపీ ఎల్ కేసుల్లో పట్టుబడిన 20 లీటర్ల మద్యాన్ని సెబ్ పోలీసులు ధ్వంసం చేశారు. పట్టణంలోని ఎస్‌ఆర్‌బీసీ ప్రధాన కాల్వ సమీపంలో సెబ్ సీఐ జోగేంద్ర సమక్షంలో సారాను పోలీసులు ధ్వసం చేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడు గ్రామంలో బెల్ట్‌షాపుద్వారా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన ఉసేన్ మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేశారు. అతని నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తుమ్మలపెంటలో సాకే ఆదెప్ప ఇంట్లో గురువారం మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు. అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి అతని నుంచి 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు ఆదెప్పపై కేసు నమోదు చేశామన్నారు.

భక్తుల కొంగు బంగారం పుట్టపెద్దమ్మ

- రేపు అమ్మవారికి బోనాలు




ఏడేళ్ల క్రితం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మ భక్తుల కొంగుబంగారంగా పూజలు అందుకుంటున్నారు. పశువులు మేపడానికి వచ్చిన ఓ భక్తుడికి సర్పరూపంలో దర్శనమిచ్చి సమీపంలో ఉన్న పుట్టలోకి వెళ్లి చిన్నారి పాప రూపంలో దర్శన మిచ్చి నేను పుట్ట పెద్దమ్మను ఇక్కడ కొలువై ఉన్నాను అని తెలిపినట్లు నానుడి. పుట్టతో పాటు పుట్ట ప్రక్కనే కొండల నుండి వచ్చే జలధార ఉంది. వేసవిలోనూ జలధార వస్తుంటుంది. భక్తుల కోరిన కోర్కెలు నెరవేరుతుండటంతో ప్రతి అమావాస్య, పౌర్ణమితోపాటు మంగళ, శుక్ర వారాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తుంటారు. ఇక్కడ ఉన్న నీటిలో స్నానం ఆచరిస్తే గ్రహ దోశాలు, సంతాన కలుగుతుందని భక్తుల నమ్మకం. ఇప్పటికి అప్పుడప్పుడూ అమ్మవారు సర్ప రూపంలో దర్శన మిస్తుంటారని భక్తులు చెబుతుంటారు. ప్రతియేటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజున కోరిన కోర్కెలు నెరవేరిన భక్తులు అమ్మవారికి పెద్ద ఎత్తున్న బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లిస్తారు. ఈ మేరకు 24న మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ, మహిళలు బోనాలు సమర్పించనున్నారు. పాత సంత కూరగాయల మార్కెట్ దగ్గర నుంచి హెచ్‌పీ గ్యాస్, బోయపేట, పుల్లమ్మ అరుగు సంజీవనగర్ రైల్వే గేటు మీదుగా అమ్మవారి ఆలయం వరకు బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్తారు మహిళలు.

ఏడేళ్ల క్రితం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

పారిశ్రామిక వేత్త నారాయణస్వామి సహకారంతో పుట్ట ముందు భాగన పుట్ట పెద్దమ్మ విగ్రహం, శివుడు, నంది, జంట నాగుల విగ్రహాల ప్రతిష్ట నిర్వహించారు. పుట్ట పెద్దమ్మ ఆలయ పరిసరాలు సౌకర్యంగా ఉండేందుకు భక్తులు తమ వంతు తోడ్పాటు ఇస్తుండటంతో పచ్చని మొక్కలు, పూల మొక్కలతో పాటు ఉద్యానవనం ఏర్పాటు చేశారు. అదేవిధంగా గోశాలను ఏర్పాటు చేశారు.

భారీ ఎత్తున బోనాలు



పుట్ట పెద్దమ్మకు మాఘపౌర్ణమిని పురస్కరించుకొని శనివారం బోనాలు సమర్పించే కార్యక్రమం పెద్ద ఎత్తున్న నిర్వహిస్తున్నాం. ప్రత్యేకంగా అలంకరించిన పూల రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఊరేగింపు నిర్వహిస్తాం. గ్రామంలోని మహిళలు అందరూ బోనాల ఉత్సవంలో పాల్గొని అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలలి. - ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ

ప్రారంభోత్సవానికి అభివృద్ధి పనులు సిద్ధం

- రేపు ప్రారంభించునున్న ఎమ్మెల్యే కాటసాని



రూ.24 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ భవనం



40 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన సంపు, పంపు హౌస్



నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

సంజామల: ప్రజా సంక్షేమం,అభివృద్ధికి సమ ప్రాధ్యాన్యతనిస్తూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారు. పట్టణాలతో సమానంగా పల్లెల్లోనూ మౌలిక వసతులు కల్పిస్తుంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. ఈ మేరకు మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామంలో రూ.1.84 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. రూ.1.04 కోట్ల జల్‌జీవన్‌మిషన్ నిధులతో 90వేల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్‌ఆర్ ట్యాంక్, 40 వేల లీటర్ల నిర్మించిన సంపు, పంపు హౌస్, రూ.24 లక్షలతో వైఎస్సార్ హెల్త్‌క్లీనిక్ నూతన భవనం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. అదేవిధంగా రూ.6 లక్షలతో జగనన్న కాలనీ ఆర్చీ, ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు రూ.20 లక్షలతో చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణం పూర్తయింది. అదేవిధంగా వివిధ కాలనీలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించనున్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి ఎమ్మెల్యే కార్యక్రమాలను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రచార విభాగ జోనల్ ఇన్‌చార్జ్ పోచా శీలా రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.



నూతనంగా నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్